ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
మంగళవారం 7 జనవరి 2025



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

సమస్యలు పరిష్కరించాలని ధర్నాలు, వినతులు

రంగారెడ్డి అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. కిషన్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్, ఏర్పుల నర్సింహ్మా, సత్యనారాయణ, పెంటయ్య, నాగేష్ బాబు, ప్రవీణ్, మైసయ్య, యాదమ్మ, హంసమ్మ, పుష్పమ్మ, జ్యోతి, సులోచన, హైమావతి, ఊర్మిళ పాల్గొన్నారు.

జేఎన్ఎన్‌యూఆర్ కాలనీల్లో...

అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడ జేఎన్ఎన్‌యూఆర్ గృహకల్పలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. మూడు కాలనీల్లో 700 కుటుంబాలు జీవిస్తున్నారని, బస్సు సౌకర్యం, రేషన్ షాపు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, తాగునీటి, విద్యుత్ సమస్యలను తీర్చాలని కాలనీ వాసులు కోరారు. వినతి చేసిన వారిలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య, జిల్లా సమితి సభ్యులు శివకుమార్ తదితరులున్నారు.

మోడల్ స్కూల్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది...

మోడల్ స్కూల్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు ఔట్ సోర్సింగ్ సిబ్బంది వినతి పత్రం సమర్పించారు. 4 నెలలుగా జీతాలు లేక ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. వినతి చేసిన వారిలో చేవెళ్ల మోడల్ స్కూల్ పీడీ ఆంజనేయులు, కందుకూరు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విష్ణుప్రియ, కాశీ యాదయ్య, యాదమ్మ ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

జిల్లా గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ 2025 క్యాలెండర్‌ను కలెక్టరేట్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు రామారావు, కార్యదర్శి శ్రీనేష్ కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు పీసీ వెంకటేష్, ఉపాధ్యక్షుడు నూతనకంటి వెంకటేష్ పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

జిల్లాలో నేడు

మిషన్ భగీరథ నీటి సరఫరా బంద్

యాచారం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా గౌరిదేవిపల్లిలో పైప్‌లైన్‌ల మరమ్మతు పనులు చేపడుతున్న కారణంగా మంగళవారం మిషన్‌భగీరథ నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. యాచారం, మంచాల, కందుకూరు, ఇబ్రహీంపట్నం, శంషాబాద్, అబ్దుల్లాపూర్‌మెట్, మహేశ్వరం మండలాలకు మిషన్‌భగీరథ నీటి సరఫరా ఉండదని తెలిపారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

యాచారం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మంతన్‌గౌరెల్లిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, వైర్ల కింద చెట్ల నరికివేత పనులు చేపడుతున్న నేపథ్యంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. భానుతండా, మీసాలతండా, నూన్‌సాఫ్‌తండా, కేస్లీతండా, మంతన్‌గౌరెల్లి గ్రామాలకు కరెంట్ ఉండదని చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

చేవెళ్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ మోడల్ స్కూల్‌లో విద్యార్థులు ప్రవేశం పొందేందుకు ప్రభుత్వం ఈనెల 6వ తేదీ నుంచి వచ్చే నెల 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చేవెళ్ల మోడల్ స్కూల్ అధ్యాపకులు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 13వ తేదీన పరీక్ష ఉంటుందన్నారు. ఓసీ అభ్యర్థులు 200, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు రూ.125 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

36,63,152

జిల్లా ఓటర్ల సంఖ్య

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఎలక్షన్ కమిషన్ సిద్ధమవుతోంది. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల తోపాటు బ్యాలెట్ బాక్సులను అధికారులు సిద్ధం చేశారు. ఇటీవల ఎన్నికల గుర్తులు కూడా ఖరారు చేశారు. తాజాగా ఎలక్షన్ కమిషన్ ఓటర్ల తుది జాబితాను విడుదల చేసింది. జిల్లావ్యాప్తంగా 36,63,152 మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించింది. ఇందులో మహిళలే అధికంగా ఉన్నారు. అక్టోబరు 29న ప్రకటించిన ముసాయిదా ప్రకారం పోలిస్తే సవరించిన జాబితాలో 10,706 మంది ఓటర్లు పెరిగారు.





ఓటరు తుది జాబితా విడుదల
ముసాయిదా తర్వాత పెరిగిన ఓటర్లు 10,706
మహిళలు 18,84,092
పురుషులు 17,78,627
ఇతరులు 433
మహిళా ఓటర్లు అధికం

రంగారెడ్డి అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా ఓటరు జాబితా సవరణ 2025 ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ఎన్నికల సంఘం సవరించిన ఓటరు తుది జాబితాను సోమవారం విడుదల చేసింది. ఈ జాబితా ప్రకారం జిల్లాలో 36,63,152 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 18,84,092 మంది, మహిళలు 17,78,627 మంది, ఇతరులు 433 మంది ఉన్నారు. ఎన్ఆర్ఐ ఓటర్లు 361 ఉండగా, మొత్తం సర్వీసు ఓటర్లు 615 మంది ఉన్నారు. అక్టోబరు 29న ప్రకటించిన ముసాయిదా ప్రకారం జిల్లాలో 36,52,446 మంది ఓటర్లు ఉండగా, ప్రస్తుతం తుది ఓటరు జాబితాను పరిశీలిస్తే జిల్లాలో 10,706 మంది ఓటర్లు పెరిగారు. నూతన ఓటరు జాబితా తయారీలో భాగంగా 2024 ఆగస్టు 20 నుంచి అక్టోబరు 18వ తేదీ వరకు బీఎల్వోలు ఇంటింటా సర్వే నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కొత్త ఓటర్ల నమోదుతో పాటు ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేపట్టారు. అక్టోబరు 29న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించారు. నవంబరు 9, 10వ తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆన్‌లైన్‌లో ఓటర్లుగా నమోదు

మిగతా 8వ పేజీలో...

షాద్‌నగర్‌లో మహిళా ఓటర్లే అధికం

జిల్లాలో మొత్తం 8 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. అన్ని నియోజకవర్గాల్లో పురుషుల ఓటర్లే అధికంగా ఉన్నారు. కానీ.. షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. 268 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం పురుషుల ఓటర్లు 1,21,326 ఉండగా.. మహిళా ఓటర్లు 1,21,978 ఉన్నారు. పురుషుల కంటే మహిళలు 652 మంది అధికంగా ఉన్నారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పీఎస్‌లు	మహిళలు	పురుషులు	ఇతరులు	మొత్తం
ఇబ్రహీంపట్నం	359	1,72,898	1,70,130	34	3,43,062
ఎల్బీనగర్	577	3,14,708	2,91,401	133	6,06,242
మహేశ్వరం	542	2,88,633	2,75,485	66	5,64,184
రాజేంద్రనగర్	547	3,20,546	2,98,686	36	6,19,268
శేరిలింగంపల్లి	639	4,04,203	3,61,689	144	7,66,036
చేవెళ్ల	298	1,37,228	1,37,149	5	2,74,382
కల్వకుర్తి	271	1,24,550	1,22,109	2	2,46,661
షాద్‌నగర్	268	1,21,326	1,2,1978	13	2,43,317
మొత్తం	3501	18,84,092	17,78,627	433	36,63,152

రైతు సంక్షేమానికి పెద్దపీట

రూ.2వేల కోట్లతో కోహెడలో మెగా మార్కెట్ యార్డు

మొయినాబాద్‌లో కొత్త మార్కెట్ ఏర్పాటుకు కృషి.. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

షాబాద్ / చేవెళ్ల, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని, అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే రూ. 40వేల కోట్ల రుణమాఫీ చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. సోమవారం షాబాద్ మండలం సర్దార్‌నగర్ మార్కెట్ ప్రాంగణంలో నూతన పాలక వర్గం ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఔటర్ రింగ్‌రోడ్ సమీపంలో కోహెడ వద్ద రూ. 2వేల కోట్లతో మెగా మార్కెట్ ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఈ మార్కెట్‌లో పూలు, పండ్లు, కూరగాయాలతో పాటు రైతులు పండించే ప్రతీ పంటను విక్రయించుకోవచ్చన్నారు. ఎమ్మెల్యే యాదయ్య, భీంభరత్ కోరిక మేరకు మొయినాబాద్‌లో కొత్త మార్కెట్ యార్డును ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతుల కోసం బడ్జెట్‌లో 35 శాతానికిపైగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం

మిగతా 8వ పేజీలో...



చేవెళ్లలో దుకాణ సముదాయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, స్పీకర్ ప్రసాద్‌కుమార్

గ్రామీణ రహదారులకు పెద్దపీట

గ్రామీణ రహదారులకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. సోమవారం షాబాద్ మండలం తిమ్మారెడ్డిగూడ వద్ద ఈసీ వాగుపై రూ.5 కోట్లతో నిర్మించిన బ్రిడ్జిని, ఏట్లఎర్రవల్లి గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు మరియు బీసీ భవనాన్ని ప్రారంభించారు. ఏట్ల ఎర్రవల్లి వద్ద వాగుపై రూ.2 కోట్లతో నిర్మించే వంతెనకు శంకుస్థాపన చేశారు. అనంతరం సర్దార్‌నగర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు సునీతారామస్వామి, పాండు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లేష్, మాజీ సర్పంచులు రవీందర్ నాయక్, జనార్దన్‌రెడ్డి, అంజనేయులు, శకుంతల ఉన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ప్రజావాణికి 52 ఫిర్యాదులు

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 52 ఫిర్యాదులు అందాయి. ప్రజల నుంచి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఫిర్యాదులను స్వీకరించారు. రెవెన్యూశాఖ నుంచి 21, ఇతర శాఖల నుంచి 31 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ అధికారులు, తహసీల్దారు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

రంగారెడ్డి అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి)



ఇదేం తీరు..

కలెక్టరేట్‌కు తమ సమస్యలు విన్నవించుకునేందుకు చాలామంది బాధితులు వస్తుంటారు. అందులో కొందరు నడవలేని స్థితిలో ఉంటారు. వారి కోసం కార్యాలయంలో వీల్‌చైర్‌ను అందుబాటులో ఉంచారు. ఆ చైర్‌ను కొందరు మరోలా ఉపయోగించుకుంటున్నారు. ఐసీడీఎస్ కేంద్రాలకు తరలించే పుస్తకాలు, దుస్తులను ఆ చైర్‌లో ఉంచి వాహనాల వద్దకు తరలిస్తున్నారు. ఎమర్జెన్సీ కోసం ఉపయోగించాల్సిన చైర్‌ను ఇలా వాడటంపై కలెక్టరేట్‌కు వచ్చిన వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి జిల్లా

గ్రీన్‌ఫీల్డ్ హైవేకు భూసేకరణ

ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లిలో మార్కింగ్ షురూ

- ఆర్‌వీ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో సర్వే
- ఆమనగల్లు మండల పరిధిలో 6.1 కిలోమీటర్ల రోడ్డు
- రెండు గ్రామాల పరిధిలో 152.15 ఎకరాల భూమి సేకరణ
- 100 మీటర్లు వెడల్పుతో రహదారి నిర్మాణం
- రెవెన్యూ, పోలీసు శాఖల పర్యవేక్షణలో మార్కింగ్ పనులు



ఆకుతోటపల్లిలో సర్వే చేస్తున్న అధికారులు

ఆమనగల్లు , జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణ మార్కింగ్ పనులు ఆమనగల్లు మండలంలో సోమవారం ప్రారంభమయ్యాయి. రావిర్యాల ఔటర్ రింగ్ రోడ్డు నుంచి ఫోర్త్ సిటీని కలుపుతూ నిర్మించే గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రహదారి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల భూ సేకరణ నోటిఫికేషన్ విడుదల చేసింది. మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, యాచారం మండలం కుర్మిద్ద, కడ్తాల మండలం కడ్తాల్, ముద్విన్, ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి, ఆమనగల్లు రెవెన్యూ గ్రామాల పరిధిలో 554.34 ఎకరాల భూమి రహదారి సేకరణకు అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. ఓఆర్ఆర్ నుంచి ఆమనగల్లు వద్ద నిర్మించ తలపెట్టిన ఆర్ఆర్ఆర్ వరకు నిర్మించే గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి ఇప్పటికే మొదటి విడత ఇబ్రహీంపట్నం మండలం ఫిరోజ్‌గూడ, కొంగరకలాన్, మహేశ్వరం మండలం కొంగరకుర్దు, కందుకూరు మండలం లేమూరు, తిమ్మాపూర్, రాచులూరు, గుమ్మడవెల్లి, పంజాగూడ, మీర్‌ఖాన్‌పేట గ్రామాల పరిధిలో భూసేకరణ, మార్కింగ్ పూర్తి చేశారు. రెండో విడతలో భాగంగా ఆమనగల్లు మండలంలో 6.1 కిలోమీటర్ల పరిధిలో చేపట్టే గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణానికి ఆకుతోటపల్లి నుంచి మార్కింగ్, భూసేకరణ ప్రారంభించారు. ఆర్వీ కన్సల్టెన్సీ సంస్థ ఆధ్వర్యంలో మార్కింగ్, భూసేకరణ సర్వే చేపట్టారు. ఆకుతోటపల్లి రెవెన్యూ పరిధిలో 223 మంది రైతులకు చెందిన 83.35 ఎకరాలు, ఆమనగల్లు రెవెన్యూ పరిధిలో 331 మంది

మిగతా 8వ పేజీలో...

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం ఆపాలని వినతి

8

మహానగరంగా మహేశ్వరం

- అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ
- నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు రూ.157 కోట్లు విడుదల
- మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి వెల్లడి
- తుక్కుగూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



వివరాలు 7లో..

జిల్లా వ్యాప్తంగా అల్పాహారం అందించాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొడంగల్ నియోజకవర్గంలో ని పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నట్లుగానే జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో అమలు చేయాలని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, సుదర్శన్‌లు అన్నారు. తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను సోమవారం కలిసి ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలైన బకాయిలు విడుదల చేయాలన్నారు. పీఆర్‌సీ రిపోర్ట్ తెప్పించి అమలు చేయడంతో పాటు పాఠశాలల్లో విద్యుత్ బకాయిలను రద్దు చేయించాలని స్పీకర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో రఘునందన్‌రెడ్డి, మొగులయ్య, గోపాల్, మల్లారెడ్డి, దేవయ్య, శివప్ప, విష్ణువర్దన్, బస్వరాజ్, సమీయోద్దీన్, బాబు, శ్రీనివాస్, వెంకటేశ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు దండిగా కంది

- కొనుగోలు కేంద్రంలో అందని 'మద్దతు'
- మార్కెట్‌లో క్వింటాల్ ధర రూ.8,600





మార్కెట్‌లో కందుల బస్తాలు, కొనుగోలు కేంద్రంలో తాళం వేసి ఉంచిన గోదాం

తాండూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): తాండూరు వ్యవసాయ మార్కెట్ యార్డు (గంజ్) కందుల రాకతో కళకళలాడుతోంది. కొన్నేళ్లుగా పంటలకు సరైన ధరలేక ఈ మార్కెట్‌లో క్రయవిక్రయాలు జరగలేదు. ఈ ఏడాది ప్రభుత్వం మద్దతు ధరకంటే ఎక్కువ గంజ్ మార్కెట్‌లో కందులకు ధర పలుకుతుండటంతో రైతులు క్యూకడుతున్నారు. తాండూరు వ్యవసాయ మార్కెట్‌లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోని మద్దతు ధర కంటే ఎక్కువగా వ్యాపారులు చెల్లిస్తున్నారు. క్వింటాల్ కందుల ధర తాండూరు వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం రూ.8600ధర పలికింది. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో తాండూరు డీసీఎంఎస్‌లో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ ప్రభుత్వం మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7550 పలుకుతోంది. మార్కెట్ యార్డు ధరకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి తేడా రూ.1050 ఉంది. దీంతో రైతులు వ్యవసాయ మార్కెట్‌లో కందులు విక్రయానికి మొగ్గు చూపుతున్నారు. మార్కెట్ (గంజ్)లోని రెండు షెడ్‌లు కందుల బస్తాలతో నిండి పోయాయి. రోజూ 2500 క్వింటాళ్ల వరకు కందులు క్రయ విక్రయాలు జరుగుతున్నాయి.

కొనుగోలు కేంద్రంలో కొర్రీలు

ప్రభుత్వ కందుల కొనుగోలు కేంద్రంలో నాణ్యత ప్రమాణాల పేరిట కొర్రిలు పెడుతున్నారు. తాండూరు డీసీఎంఎస్ కేంద్రంలో ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. తేమ 12శాతం, ఇతర పదార్థాలు రెండు శాతం, దెబ్బతగిలిన గింజలు మూడు శాతం, రంగుపోయినవి, కొద్దిగా దెబ్బతిన్నవి నాలుగు శాతం, పక్కంకాని, ముడుకొని పాలు గింజలు మూడు శాతం, పురుగు పట్టిన గింజలు 1శాతం, ఇతర వంగింజలు మూడు శాతం నాణ్యత ప్రమాణాలు ఉండాలని సూచించారు. రైతులు తప్పనిసరిగా పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, బ్యాంక్ పాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో పాటు ఏఈఓ ద్వారా ఆన్‌లైన్ ధ్రువీకరణపత్రం సమర్పించాలని నిబంధనలు పెట్టారు.

20ఏళ్లుగా ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం



జిల్లా కార్యవర్గాన్ని ప్రకటిస్తున్న కేతావత్ గోవింద్ నాయక్

వికారాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం గత 20 సంవత్సరాల నుంచి తెలంగాణ గిరిజన ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేతావత్ గోవింద్ నాయక్ తెలిపారు. సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా తిమ్యానాయక్, ప్రధాన కార్యదర్శిగా నేనావత్ రవికుమార్ నాయక్, గౌరవ అధ్యక్షుడిగా గోబ్రియ నాయక్, కోశాధికారిగా నీల్యానాయక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు అంబర్ సింగ్ నాయక్, రాష్ట్ర కోశాధికారి కృష్ణ నాయక్, మేడ్చల్ జిల్లా టీజీయూఎస్ అధ్యక్షుడు రమేష్ నాయక్, హీరాలాల్, బాబుసింగ్, హరిలాల్, గోపాల్, వెంకట్, పాండు నాయక్, హీర్యానాయక్, నర్స్యానాయక్ పాల్గొన్నారు.

భారతీయ విలువలు పెంపొందించేందుకు కృషి



తపస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రేణుకాదేవి

వికారాబాద్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో భారతీయ విలువలను పెంపొందించే విధంగా తపస్ కృషి చేస్తోందని తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి అంజిరెడ్డి, మహేంద్ర బహదూర్ అన్నారు. సోమవారం 2025 సంఘం క్యాలెండర్‌ను జిల్లా విద్యాధికారి రేణుకాదేవి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి లక్ష్మీకాంత్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటేశం, జిల్లా కోశాధికారి నర్సిములు, జిల్లా ఉపాధ్యక్షులు బుచ్చిలింగం, సంగమేశ్వర్, గోపాల్, లక్ష్మణ్, చంద్రశేఖర్, అనిల్, వీరేశ్, చిన్న కృష్ణ, సాయిబాబా శ్రీశైలం పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్ శివ

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన వైట్‌బెల్ట్ ఉస్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో కాచవాని సింగారం గ్రామంలోని నిహాక్ ఇంటర్‌నేషనల్ స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. పాఠశాలకు చెందిన 17మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో నలుగురు స్వర్ణ పథకాలు, ఒకరు రజత పతకం, మరో 12మంది కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల యాజమాన్యం, కరాటే కోచ్ శివ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇబ్రహీంపట్నం-చౌటుప్పల్ బస్సును పునరుద్ధరించండి

ఇబ్రహీంపట్నం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం-చౌటుప్పల్ మధ్య నడిచే బస్సును తిప్పాయిగూడ మీదుగా పాత రూట్‌లో తిరిగి నడపాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ఇబ్రహీంపట్నం డిపో ఎదుట ఆందోళన చేశారు. కరోనా సమయం కంటే ముందు ఇబ్రహీంపట్నం-చౌటుప్పల్ (యాదాద్రి-భువనగిరి జిల్లా) బస్సు ఆరుట్ల, తిప్పాయిగూడ మీదుగా నడిచేదని. తర్వాత బస్సును నడపకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటూ సీపీఎం జిల్లా కార్యదర్శి పి.యాదయ్య ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే బస్సును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఏసీపీ కేపీవీ రాజు ఆర్టీసీ అధికారులతో ఈ విషయమై చర్చించగా సానుకూలంగా స్పందించినట్లు సీపీఎం నాయకులు తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి రావుల జంగయ్య, జి.నర్సింహ, సుధాకర్, మాధవి తదితరులున్నారు.

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ



డిపోలో డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంవీఐ అనూష

ఇబ్రహీంపట్నం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటే వీలైనంతమేర రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని ఇబ్రహీంపట్నం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ అనూష తెలిపారు. రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా సోమవారం ఇబ్రహీంపట్నం డిపోలో జరిగిన కార్యక్రమంలో డ్రైవర్లనుద్దేశించి ఆమె మాట్లాడి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఎం వెంకటనర్సప్ప, అసిస్టెంట్‌మేనేజర్ రాజేష్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ప్రతీ పల్లెకు 'ప్రగతిరథ చక్రాలు'



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

షాబాద్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రతీ పల్లెకు ప్రగతిరథ చక్రాలు(బస్సులు) వస్తాయని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని మక్తగూడ నుంచి కడుమూరు వరకు సోమవారం ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను ఆయన ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నర్సింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీశైలం, తదితరులు ఉన్నారు.

ఇంటర్వ్యూలకు అనూహ్య స్పందన



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

కొడంగల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మహిళా అభ్యర్థులకు ఉద్యోగ అవకాశం కోసం నిర్వహించిన ఇంటర్వ్యూలకు అనూహ్య స్పందన లభించింది. అమర్‌రాజ్ కంపెనీ ప్రతినిధులు సోమవారం కడా కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 250కిపైగా అభ్యర్థులు హాజరయ్యారు. అందులో 25 సంవత్సరాలకు పైబడిన వారిని అనర్హులుగా తెలుపుతూ 130 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉదయం 10నుంచి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో అమర్‌రాజ్ కంపెనీ ప్రతినిధులు, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఏపీయం సిబ్బంది సహకారంతో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలో అర్హత సాధించిన వారికి తిరుపతిలోని అమర్‌రాజ కంపెనీలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం మహబూబ్‌నగర్‌లోని అమర్‌రాజ్ కంపెనీలో ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు.





ప్రతీ మెడికల్ షాపులో తనిఖీలు చేయలేం

"మెడికల్ షాపు నిర్వాహకులు నిబంధనలు పాటించడంలేదని పేరుతో సహా ఫిర్యాదు చేస్తేనే తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటాం. ప్రతీ మెడికల్ షాపును తనిఖీ చేయలేం. మాకు ఇతర పనులు ఉంటాయి. మా పైఅధికారులకు సమాచారం అందిస్తాం. తదనంతరం చర్యలు తీసుకుంటాం.

- బి.ప్రవీణ్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, ఉమ్మడి శామీర్ పేట్ మండలం

మెడికిల్ దందా!

పుట్టగొడుల్లా మెడికల్ షాపులు

- అర్హత లేకపోయినా మందుల విక్రయాలు
- పేదల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నిర్వాహకులు
- ఆర్ఎంపీలతో కలిసి గుట్టుగా వ్యాపారం
- నిర్వాహకులతో ఔషధ నియంత్రణ అధికారుల కుమ్మక్కు!
- మూడుచింతలపల్లిలో మెడికల్ మాఫియా!

మూడుచింతలపల్లి, జనవరి6(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వస్తున్న మార్పులతో ప్రబలుతున్న రోగాలను ఆసరాగా చేసుకుని మెడికల్ షాపు నిర్వాహకులు ఇష్టమొచ్చిన మందులను ప్రజలకు అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. అర్హత లేకపోయినా ఎడాపెడా యాంటీబయోటిక్ మందులను విక్రయిస్తూ పేదల ఆరోగ్యంతో ఆడుకుంటున్నారు. మూడుచింతలపల్లి మండల వ్యాప్తంగా మెడికల్ దందా జోరుగా సాగుతోంది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకపోయినా జబ్బు పేరు చెప్పగానే మోతాదుకు మించి డోస్‌లను ఇస్తూ పేదలను బలి తీసుకుంటున్నారు. ఈ వ్యాపారమంతా ఔషధ నియంత్రణ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

అమ్యామ్యాలకు అలవాటుపడి

ఇటీవల మూడుచింతలపల్లిలో ఔషధ నియంత్రణ అధికారులు తనిఖీలు చేసి లైసెన్స్‌లేని ఓ క్లినిక్‌లో సుమారు రూ.40,000 విలువైన 50 రకాల యాంటీబయోటిక్ మందులను పట్టుకున్నారు. కాగా, మండల వ్యాప్తంగా ఎన్ని మెడికల్ షాపులు ఉన్నయో అధికారులకే తెలియని దుస్థితి. అధికారులు అన్ని మెడికల్ షాపుల్లో తనిఖీలు చేస్తే ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయని మందులు దొరక్క ఇబ్బందులు పడతారని సంబంధిత అధికారులు చెప్పడం విడ్డురంగా ఉందని స్థానికులు మండిపడుతున్నారు. అలాగే ఫిర్యాదు చేస్తేనే తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటామని చెబుతుండటంపై సర్వత్రా విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఫిర్యాదు చేస్తే ముందుగానే అధికారులు ఆయా మెడికల్ షాపు నిర్వాహకులకు మందస్తు సమాచారం ఇస్తూ అప్రమత్తమయ్యేలా చేస్తున్నారని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఔషధ నియంత్రణ అధికారులకు నెలనెలా ముడుపులు ఇస్తూ మేనేజ్ చేస్తున్నారని అందుకే నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న మెడికల్ షాపు నిర్వాహకులపై చర్యలు తీసుకోవడం లేదని అంటున్నారు.

ఆర్ఎంపీ డాక్టర్లను కలుపుకొని

మెడికల్ షాపు నిర్వాహకులు కొందరు ఆర్ఎంపీ డాక్టర్లను కలుపుకుని నెలవారి కమీషన్లతో పాటు మందుల విక్రయాలపై పర్సెంటేజీలు ఇస్తూ వారి వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. కొంతమంది నిర్వాహకులు తాము అధికారులను సైతం నెలనెలా చూసుకుంటామని అన్నీ మేనేజ్ చేస్తామని హామీలు ఇస్తూ ఆర్ఎంపీ డాక్టర్లు చెయ్యాల్సిందల్లా తమ మెడికల్ షాపులో లభించే మందులు మాత్రమే రాయాలని ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. ఈ తతంగం అంతా మెడికల్ షాపు నిర్వాహకులే ఒక కమిటీని ఏర్పాటు చేసుకుని ముందుండి నడిపిస్తున్నారనే సమాచారం. వీరందరికీ ఓ రాజకీయ పలుకుబడి ఉపయోగించి తెర వెనక చక్రం తిప్పుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

నామ్‌కే వస్తే తనిఖీలు..

వాస్తవానికి ఔషధ నియంత్రణ అధికారుల నుంచి లైసెన్స్ తీసుకొని మెడికల్ షాపును నిర్వహించాలి. నిబంధనల ప్రకారం అందులో ఫార్మాసిస్ట్ తప్పనిసరిగా ఉండాలి. వారే మందులను విక్రయించాలి. కానీ నిర్వాహకులు అనుమతులు తీసుకున్నప్పుడు మాత్రమే నిబంధనలు పాటిస్తూ తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇంత జరుగుతున్నా నియంత్రణ అధికారులు మాత్రం మామూళ్లకు అలవాటు పడి అనుమతులు ఇచ్చేటప్పుడు మాత్రమే నిబంధనలు పాటిస్తున్నారా లేదా అని చూస్తున్నారు తప్ప తర్వాత అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు.

సీఎం చొరవతో మహానగరంగా మహేశ్వరం



రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కేఎల్లార్, భాస్కర్‌రెడ్డి

మహేశ్వరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): దేశానికే తలమానికంగా త్వరలో మహేశ్వరం మహానగరంగా మారబోతోందని, స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే ప్రత్యేక దృష్టి సారించారని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం రూ.157 కోట్లు విడుదల చేయడాన్ని అభినందిస్తూ సోమవారం తుక్కుగూడలోని మహేశ్వరం నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన పాలాభిషేకం చేశారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న, జరగబోయే అభివృద్ధి పనులు దేశానికే తలమానికంగా నిలుస్తాయని సీఎం తెలిపినట్లు కేఎల్లార్ చెప్పారు. 330 ఫీట్ల రోడ్డుకు ఈ నెలలోనే శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఓఆర్ఆర్ టు ట్రిబుల్‌ఆర్ వరకు విస్తరించే రోడ్డు, పలు రకాల పరిశ్రమలకు భూ సేకరణ సమస్య తలెత్తకుండా చూడాలని, రైతులు నష్టపోకుండా పరిహారంతో పాటు ప్లాట్లు, మహిళలకు సోలార్ ఎనర్జీ ప్లాంట్లు ఇవ్వాలని సీఎం నిశ్చయించారని చెప్పారు. మహేశ్వరం, కందుకూరు మండలాలను మున్సిపాలిటీలుగా మార్చడమా? ఫోర్త్‌సిటీ పేరుతో ప్రత్యేక కార్పొరేషన్ చేయడమా? అనేది ప్రభుత్వ పెద్దలు యోచిస్తున్నారని, త్వరలో ఆ నిర్ణయం కూడా వెలువడుతుందన్నారు. పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి, కూన యాదయ్య, వత్తుల రఘుపతి, మురళీధర్‌రెడ్డి, కారి ఈశ్వర్, రాజునాయక్ తదితరులు ఉన్నారు.

రైతు భరోసాపై అపోహలొద్దు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ రూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రైతు భరోసాపై ప్రతిపక్షాల మాటలు నమ్మి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సాగులో ఉన్న ప్రతీ ఎకరాకు ప్రభుత్వం రైతు భరోసా కింద ఆర్థిక సాయం ఇస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఆర్థిక క్రమశిక్షణ లేకపోవడం వల్ల గత పదేళ్ల రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందన్నారు. రూ.7లక్షల కోట్ల అప్పు ఉండగా.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని తెలిపారు. ప్రజాపాలనను ప్రజలు ఆదరిస్తున్నారని, బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఓర్వలేకపోతున్నాయని విమర్శించారు. సాగు చేయని భూములకు రైతు భరోసా ఇవ్వమని ప్రభుత్వం చెప్పడంతో గగ్గోలు పెడుతున్నారని అన్నారు. ఎమ్మెల్సీ కవిత బీసీలపై కపట ప్రేమ ఒలకబోస్తున్నారని, ఆమె రాజకీయ పలుకుబడి కోల్పోయి బెంబేలు పడుతున్నారని తెలిపారు. బీసీలపై ప్రేమ ఉంటే కేటీఆర్‌ను వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి నుంచి తప్పించి బీసీకి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలపై సీఎం రేవంత్‌రెడ్డికి ప్రేమ ఉన్నందుకే బీసీ కుల గణన చేస్తున్నారని తెలిపారు. రైతు భరోసా వల్ల కౌలు రైతులకూ మేలు జరుగుతుందన్నారు. నాయకులు కొంకళ్ల చెన్నయ్య, తిరుపతిరెడ్డి, బస్వం తదితరులు ఉన్నారు.

'హెరిటేజ్' ఆధ్వర్యంలో పాడి రైతులకు ప్రోత్సాహకాలు



పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సాంబశివరావు

మహేశ్వరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): హెరిటేజ్ డెయిరీ పాడి రైతులకు ఎన్నో విధాలుగా లాభాలు చేకూరేలా ప్రోత్సాహకాలు అందిస్తుందని హెరిటేజ్ డెయిరీ అధ్యక్షుడు డాక్టర్ సాంబశివరావు అన్నారు. సోమవారం మండలంలోని సుభాన్‌పూర్‌లో పాడి రైతులతో హెరిటేజ్ సిబ్బంది పాల దిగుబడి, అధిక లాభాలు, డైరీ ప్రోత్సాహకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు సబ్సిడీలో పశువుల కొనుగోలుకు రుణాలు, దానా, ఇన్సూరెన్స్, నట్టల మందులను అందిస్తున్నట్లు తెలిపారు. రైతులకు రూ.2లక్షల ఉచిత ప్రమాద బీమా కల్పిస్తూ రూ.50లకే సెమిన్ అందిస్తూ రైతుల ఆర్థికాభివృద్ధికి హెరిటేజ్ డెయిరీ అన్ని విధాలుగా తోడ్పాటునందిస్తుందన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండానే పాల బిల్లులను 10 రోజులకోసారి నేరుగా రైతుల ఖాతాల్లోనే జమ అయ్యే విధంగా చేస్తున్నామన్నారు. నర్సింగ్‌రావు, పవన్‌కుమార్, వెంకటేష్, రవీందర్, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డితో పాటు పాడి రైతులు పాల్గొన్నారు.

దుద్యాలలో ఇండస్ట్రియల్ కారిడార్‌కు భూ సర్వే



దుద్యాల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండల పరిధిలో ఇండస్ట్రియల్ కారిడార్ కోసం అధికారులు భూసర్వే చేపట్టారు. పోలెపల్లి గ్రామ శివారులో గల సర్వే నెంబర్ 67లోని ప్రభుత్వ భూమిలో తహసీల్దార్ కిషన్‌నాయక్ ఆధ్వర్యంలో సోమవారం భూసర్వే నిర్వహించారు. రైతులు తమ భూముల హద్దులను అధికారులకు చూపించారు. ఇప్పటికే హకీంపేటలో 252 సర్వే నెంబరులో ఉన్న 351ఎకరాల ప్రభుత్వ భూములకు సంబంధించిన సర్వే పూర్తయింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ భరత్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్ బాబు, ఆర్ఐలు నవీన్, రవీందర్‌చారి, నాగార్జున్‌రెడ్డి, వేణు, సర్వేయర్లు మహేశ్, ప్రవీణ్, మహేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

26 నుంచి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా

- కమీషన్ల కోసమే బీఆర్ఎస్ పథకాలు
- త్వరలో కొత్త రేషన్ కార్డులు
- అప్పులున్నా అభివృద్ధి ఆగదు
- తాండూరు దిశ దశను మారుస్తా
- విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



పెద్దేముల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): భూమిలేని వ్యవసాయ కూలీలను ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకాన్ని ఈనెల 26వ తేదీ నుంచి అధికారికంగా ప్రారంభిస్తున్నట్లు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వెల్లడించారు. ఆయన సోమవారం పెద్దేముల్‌లో ఏడాది పాలన పూర్తి అయిన సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో పాల్గొని విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రైతులకు రూ.12వేలు అందిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం రేషన్ కార్డులు లేని వారికి త్వరలోనే కొత్త రేషన్‌కార్డులను జారీ చేయనున్నట్లు తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రవేశపెట్టిన పథకాలన్నీ కమిషన్ల కోసమే తీసుకువచ్చారని ఆయన విమర్శించారు. తనకు పదవి కోసం తాపత్రయం లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో తాండూరు నియోజకవర్గ దిశదశను మార్చడమే తన లక్ష్యమన్నారు. తాండూరులో తాండూరు-హైదరాబాద్ రోడ్డు, నియోజకవర్గ కేంద్రానికి అనుసంధానంగా రోడ్లను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. వచ్చే రెండేళ్లలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్, కాలుష్య నియంత్రణలో భాగంగా జినుగుర్తి వద్ద ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుతో పాటు 30ఏళ్లుగా బషీరాబాద్ మండలం నీళ్లపల్లి, జలాల్‌పూర్, మైల్వార్, అటవీ సరిహద్దు సమస్యను పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా వ్యవసాయ సహకార సంఘాలను విస్తరణలో భాగంగా మంబాపూర్, కాశీంపూర్, పగిడ్యాల్, కరన్‌కోట్‌లలో నూతన సొసైటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గోట్లపల్లి మోడల్ స్కూల్‌ను అప్‌గ్రేడ్ చేస్తూ హాస్టల్ వసతి కల్పించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, ధారాసింగ్, ఉత్తమ్‌చంద్, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు శోభారాణి, కాంగ్రెస్ నాయకులు ఎల్లారెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి స్వీట్లు తినిపించి సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

మల్లు రవికి అభినందనలు



ఆమనగల్లు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేంద్ర మాజీమంత్రి, దివంగత సూదిని జైపాల్‌రెడ్డి పేరు పెట్టాలని కేబినెట్ తీసుకున్న నిర్ణయం హర్షదాయకమని జైపాల్ రెడ్డి సోదరుడు సూదిని మనోహర్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కాయితి సాయిరెడ్డిలు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. కేబినెట్ నిర్ణయం నేపథ్యంలో అందుకు చొరవ తీసుకున్న నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవిని సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

కాలేజీ భవన నిర్మాణానికి విరాళం

షాద్‌నగర్ అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలపై ఆధారపడకుండా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్న సంకల్పంతో చేపట్టిన షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి విశేష స్పందన వస్తున్నదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆనందం వ్యక్తం చేశారు. కళాశాల భవన నిర్మాణం కోసం వ్యాపారవేత్త పూర్ణచందర్ సోమవారం రూ.5లక్షల చెక్కును ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా పూర్ణచందర్‌ను ఎమ్మెల్యే శంకర్ సన్మానించి అభినందించారు.

36,63,152

జిల్లా ఓటర్ల సంఖ్య

(5వ పేజీ తరువాయి)

చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో తప్పుల సవరణ, మార్పులు, చేర్పులు, మృతుల పేర్ల తొలగింపు, పోలింగ్ కేంద్రాలు, నియోజకవర్గాల మార్పు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. డిసెంబరు 6వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించారు. 2025 జనవరి 6వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రకటించారు. తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలోని 3,501 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 36,63,152 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు.

అత్యధిక ఓటర్లు శేరిలింగంపల్లిలోనే..

జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, అత్యధిక ఓటర్లు శేరిలింగంపల్లిలోనే ఉన్నారు. ఈ నియోజకవర్గంలో మొత్తం 7,66,036 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 4,04,203 మంది పురుషులు, 3,61,689 మంది మహిళలు ఉన్నారు. అలాగే ఇతరులు కూడా అధికంగానే ఉన్నారు. 1,434మంది ఇతర ఓటర్లు ఉన్నారు. అత్యల్పంగా షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 2,43,317 మంది ఓటర్లు ఉన్నారు.

ఎన్ఆర్ఐ, సర్వీసు ఓటర్ల వివరాలు

	ఎన్ఆర్ఐ ఓటర్లు		సర్వీసు ఓటర్లు	
నియోజకవర్గం	పురుషులు	మహిళలు	పురుషులు	మహిళలు
ఇబ్రహీంపట్నం	26	07	52	02
ఎల్బీనగర్	45	07	50	08
మహేశ్వరం	47	12	67	12
రాజేంద్రనగర్	87	23	91	11
శేరిలింగంపల్లి	42	12	50	11
చేవెళ్ల	04	02	68	0
కల్వకుర్తి	02	0	134	02
షాద్‌నగర్	0	0	55	02
మొత్తం	253	63	567	48

క్రైం కార్నర్

బొలెరో-కారు ఢీ..

▶▶ ఒకరి మృతి..

▶▶ ముగ్గురికి తీవ్ర గాయాలు

కందుకూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి):బొలెరో.. కారు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై పరమేష్ కథనం మేరకు.. బాలన్పల్లి గ్రామం, తాడూరు మండలం, నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన భారూ భరత్(20)తో పాటు అదే గ్రామానికి చెందిన కొమ్ము దయాకర్, పసుపుల కుమార్, ఎం.రమేష్, జి.సాయి బొలెరో డ్రైవర్, వెలిజల శివకుమార్‌లతో కలిసి ఎండు మిర్చి అమ్మడానికి శనివారం గ్రామం నుంచి బయలుదేరారు. మార్గమధ్యలో కందుకూరు మండలంలోని దెబ్బడగూడ గేటు వద్ద కారు కందుకూరు నుంచి కడ్తాల మండలానికి వెళుతుండగా బొలెరో వాహనం రాత్రి 11 గంటల సమయంలో బలంగా ఢీకొట్టింది. బొలెరోలో ఉన్న భరత్‌కు తీవ్రగాయాలు, మిగిలిన వారికి రక్తగాయాలు కావడంతో నగరంలోని ఓ ఆస్పత్రికి తరలిస్తుంగా భరత్ మార్గమధ్యలో మృతిచెందాడు. భరత్ ఐటీఐ సెకండియర్ చదువుతున్నట్లు ఎస్సై పరమే ష్ తెలిపారు. కేసు నమోదు చేసుకొని ద ర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డీసీఎం టైర్ల కింద పడి కార్మికుడి దుర్మరణం

ఇబ్రహీంపట్నం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధి శేరిగూడ వద్ద సోమవారం ఓ కోళ్ల ఫీడింగ్ మిల్లులో డీసీఎం చక్రాల కిందపడి బిహార్‌కు చెందిన కార్మికుడు అక్కడిక్కడే మృతిచెందాడు. బిహార్‌కు చెందిన ఆకాష్ (20) మల్లికార్జున కోళ్ల ఫీడింగ్ మిల్‌లో లేబర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం దాణా లోడ్‌తో బయటకు వస్తున్న డీసీఎంను ఆకాష్ ముందు నుంచి ఎక్కుతుండగా డ్రైవర్ ఒక్కసారిగా ముందుకు పోనివ్వడంతో అదుపుతప్పి ఆకాష్ టైర్లకింద పడ్డాడు. చక్రాలకింద నలిగి గాయపడ్డ ఆకాష్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

వృద్ధుడు అదృశ్యం


కృష్ణయ్య(ఫైల్)

కేశంపేట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామానికి చెందిన కందాడ కృష్ణయ్య(62) అదృశ్యమైనట్లు సీఐ నరహరి సోమవారం తెలిపారు. ఈనెల 1న కృష్ణయ్య ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. బంధువుల ఇళ్లలో, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఆచూకీ తెలిస్తే సీఐ-9440904759, ఎస్సై-8712568396 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అక్రమంగా బ్లాస్టింగ్.. ఇద్దరి అరెస్టు

యాచారం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఓ వెంచర్‌లో అక్రమంగా బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరిని సోమవారం రాత్రి యాచారం పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని కొత్తపల్లికి చెందిన రవి, శ్రీనివాస్‌లు హైదరాబాద్-నాగార్జునసాగర్ ప్రధాన రహదారి పక్కన తమ్మలోనిగూడ గేటు సమీపంలో గల వెంచర్‌లో బండరాళ్లను డిటోనేటర్లతో పేల్చేందుకు యత్నించారు. యాచారం పోలీసులకు పక్కా సమాచారమందడంతో దాడి చేసి రవి, శ్రీనివాస్‌లు బండరాళ్లకు కంప్రెషర్‌తో రంధ్రాలు చేస్తుండగా అరెస్టు చేశామని సీఐ చెప్పారు. కాగా, వారివద్ద ఎలాంటి డిటోనేటర్లు లభ్యం కాలేదన్నారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి

ఆదిభట్ల, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అగస్త్య కళాశాలలో నీట్ లాంగ్‌టర్మ్ విద్యనభ్యసిస్తున్న విద్యార్థిని అనారోగ్యంతో చికిత్సపొందుతూ మృతిచెందిన ఘటన సోమవారం ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం మేరకు.. మహబూబాబాద్ జిల్లా, పెద్దవంగర మండలం, పోచంపల్లికి చెందిన మైలాపాక సోని(19) బైపీపీ పూర్తిచేసి ఆదిభట్ల పరిధిలోని టీసీఎస్ సమీపంలోని అగస్త్య కళాశాలలో నీట్ లాంగ్‌టర్మ్ విద్యనభ్యసిస్తోంది. శనివారం ఆరోగ్యం బాగోలేదని మన్నెగూడలోని మహోనియా ఆసుప్రతిలో చూపించుకోగా.. డాక్టర్ జర్వం ఉందని చెప్పి చికిత్స అందించాడు. సోని హాస్టల్‌కు వచ్చి మాత్రలు వేసుకొని విశ్రాంతి తీసుకుంది. ఆదివారం అర్ధరాత్రి కడుపునొప్పి వస్తుందని వార్డెన్‌కు తెలపడంతో మళ్లీ అతడు హాస్పిటల్‌కు తీసుకెళ్లాడు. డాక్టర్లు ఆరోగ్యం విషమించిందని తెలపడంతో యశోదకు తరలించారు. డాక్టర్ పరిశీలించి మృతిచెందినట్లు నిర్ధారించారు.

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య

శంకర్‌పల్లి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించలేక ఓ యువకుడు రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. వికారాబాద్ రైల్వే పోలీసుల కథనం మేరకు శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి ఫత్తేపురంనకు చెందిన బి.మనోహర్ యాదవ్(26) ఫత్తేపురంలోనే పశువుల దానా దుకాణం పెట్టుకుని జీవనం సాగించేవాడు. దుకాణం సరిగా నడవకపోవడంతో అప్పులు పెరిగిపోయాయి. మనోహర్ జీవితంపై విరక్తిచెంది ఆదివారం రాత్రి ఫత్తేపురంలో రైలుకింద పడి చనిపో యాడు. సోమవారం ఉదయం స్థానికులు గమనించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఈమేరకు వికారాబాద్ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

(5వ పేజీ తరువాయి)


సర్దార్‌నగర్‌లో ప్రమాణస్వీకారం చేస్తున్న ఏఎంసీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి

లక్ష రూపాయలు రుణమాఫీని విడతల వారీగా చేసిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేసిందని ఆయన అన్నారు. జనవరి 26 నుంచి రైతు భరోసా కోసం రూ. 10 వేల కోట్లు కేటాయిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా వానాకాలం నుంచి పంట బీమాకు రూ.3500 కోట్లు కేటాయించి రైతులకు పూర్తి స్థాయి నష్టపరిహారం ప్రభుత్వం అందిస్తుందన్నారు. రైతుబీమాకు రూ. 3వేల కోట్లు ఇస్తున్నామన్నారు. అనంతరం ఏఎంసీ నూతన పాలకవర్గం చైర్మన్‌గా పీసరి సురేందర్‌రెడ్డి, వైస్‌చైర్మన్‌గా జంగయ్య, డైరెక్టర్లుగా అక్తర్‌పాష, నర్సింహులు, లలిత, బాలకృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, జైపాల్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీరాంరెడ్డి, సంజీవరెడ్డి, సంతోష్‌కుమార్, మహాత్మలతో జిల్లా మార్కెటింగ్ అధికారి రియాజ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పీసరి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ... రైతులు పండించిన పంటలకు మద్దతు ధర అందేలా చూస్తామన్నారు. మార్కెట్‌లో రైతులకు అవసరమైన మౌళిక వసతులు కల్పనకు తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యులు చింపుల సత్యనారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ పి. కృష్ణారెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, చేవెళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ బి. రాములు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, ప్రభాకర్ పాండుయాదవ్, సత్యనారాయణ, సున్నపు వసంతం, ఎం. యాదగిరి, బండారు అగిరెడ్డి, నర్సింలు, మహేందర్‌రెడ్డి, నాగులేరెడ్డి, మాదవరెడ్డి, రాంచంద్రయ్యగౌడ్, మాణిక్యరెడ్డి, సుబాష్‌గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, నర్సింలు, మాణిక్యం, ఉదయ్‌మోహన్‌రెడ్డి, షాబాద్ దర్శన్, కావలి చంద్రశేఖర్, మాణయ్య, అశ్విని, శేఖర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పెంటయ్యగౌడ్, రాంరెడ్డి, కృష్ణారెడ్డి, నాయకులు మొగిలిద్ద లక్ష్మీనర్సింహారెడ్డి, పీసరి వెంకట్‌రెడ్డి, మధుసూదన్‌గుప్తా, రాహుల్‌గుప్తా, చెన్నయ్య, నర్సింహులు, జనార్దన్‌రెడ్డి, హన్మంత్‌యాదవ్, మహేందర్‌గౌడ్, తమ్మలి రవీందర్, అశోక్, అశ్వక్‌అలీ, బర్ల యాదయ్య, ఖాజమియా, చేవెళ్ల స్వామి, రాంరెడ్డి, నరేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వేణు, బుచ్చయ్య, యాదగిరి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలను మోసగించిన కాంగ్రెస్


షాద్‌నగర్ అర్బన్ : ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాలో నాయకులు

షాద్‌నగర్ అర్బన్/కడ్తాల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలకు ముందు దేవుళ్లపై ఒట్లు పెట్టి, అధికారం రాగానే అన్నదాతలను అడుగడుగునా కాంగ్రెస్ ప్రభుత్వం మోసగిస్తూపోతున్నదని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. బీఆర్ఎస్ పిలుపుమేరకు సోమవారం ఫరూఖ్‌నగర్ మండల తహసీల్దార్ ఆఫీసు ఎదుట రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ధర్నా చేపట్టారు. బీఆర్ఎస్ ముఖ్యనాయకులు హాజరై కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల రుణ మాఫీ, ప్రతీ ఎకరాకు రూ.15వేల పెట్టుబడి సాయం, ధాన్యం సన్నాలకు రూ.500 బోనస్, కౌలు రైతులకు సైతం ఎకరాకు రూ.15వేల రైతు బంధును ఇస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మాట తప్పిందన్నారు. మున్సిపల్ చైర్మన్ నరేందర్, కేశంపేట మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గణేష్, సింగిల్‌విండో చైర్మన్ బక్కన్న యాదవ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ నటరాజ్, బీఆర్ఎస్ నాయకులున్నారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.15వేలు పెట్టుబడి సాయం అందిస్తామన్న కాంగ్రెస్ ప్రస్తుతం రూ.12 వేలు ఇస్తామంటూ రైతులను దగా చేస్తున్నారని ఆరోపిస్తూ కడ్తాల మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై నిరసన ర్యాలీ నిర్వహించారు. లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు వీరయ్యలు హాజరయ్యారు. స్థానిక బస్టాండ్ కూడలిలో బైటాయించి ధర్నా, రాస్తారో కో నిర్వహించారు. సేవ్యానాయక్, వెంకటేశ్, యాదయ్యగౌడ్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.


కడ్తాల్ : వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాపాలన దరఖాస్తులు గల్లంతు!

- ఆన్‌లైన్‌లో నమోదు కాని లబ్ధిదారుల పేర్లు

చౌదరిగూడ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్న ఆప్లికేషన్ ఫారాలు గల్లంతయ్యాయి. ఈమేరకు నిజమైన లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్ నమోదు సర్వేలో కనిపించడం లేదంటూ సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు బుద్దుల జంగయ్య లబ్ధిదారులతో కలిసి కొందుర్గు ఎంపీడీవో లక్ష్మీఅనురాధకు సోమ వారం వినతిపత్రాన్ని అందజేశారు. ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం.. ఆన్‌లైన్ కానీ, నిరుపేదల దరఖాస్తులు గల్లంతుకావడంతో అర్హులైన లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని 22 పంచాయతీలో అన్ని గ్రామాల్లో ఒక్కో జీపీలో ఐదు నుంచి పది ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు గల్లంతయ్యాయని ఆరోపించారు. ఆన్‌లైన్‌లో చూపించని దరఖాస్తులను మళ్లీ స్వీకరించి నిజమైన అర్హులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా నర్సింహ, సురేష్, లబ్ధిదారులు లక్ష్మయ్య, రాములు, సునీత, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలి


మందులు అందజేస్తున్న గంప వెంకటేశ్

కడ్తాల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతీఒక్కరు పాలు పంచుకోవాలని డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్, లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్‌లు అన్నారు. మండలంలోని మక్తమాదారంలో సోమవారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్, జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ ట్రస్ట్, గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మాజీ సర్పంచ్ సులోచన సాయిలు, మాజీ ఎంపీటీసీ మంజుల చంద్రమౌళిలతో కలిసి వెంకటేశ్, దశరథ్ నాయక్‌లు ప్రారంభించారు. శిబిరంలో 420 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. నాయకులు గణేశ్, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణయ్య, తదితరులున్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవేకు భూసేకరణ

(5వ పేజీ తరువాయి)

రైతులకు చెందిన 68.80 ఎకరాలు రోడ్డు నిర్మాణానికి భూ సేకరణ ప్రాథమికంగా నిర్ధారించారు. నోటిఫికేషన్‌ను అనుసరించి ప్రైవేట్ సంస్థ మార్కింగ్‌కు శ్రీకారం చుట్టింది. రెండు వైపులా 50 మీటర్ల వెడల్పుతో 330 అడుగుల విస్తీర్ణంలో రహదారి నిర్మాణానికి మార్కింగ్ చేపట్టారు. ఆమనగల్లు తహసీల్దార్ లలిత పర్యవేక్షణలో ఆర్ఐ సంపత్, సర్వేయర్ రవి బృందం మార్కింగ్ కొనసాగిస్తున్నారు. ఆమనగల్లు సీఐ ప్రమోద్ కుమార్, ఎస్ఐ వెంకటేశ్‌ల ఆధ్వర్యంలో మార్కింగ్ చేపట్టిన ఆకుతోటపల్లిలో ముందు జాగ్రత్త చర్యలో భాగంగా పోలీసులు మార్కింగ్ చేపట్టే ప్రదేశాన్ని పరిశీలించారు. సర్వేకు ఎక్కడ ఆటంకం లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. మార్కింగ్, సర్వే ఆధారంగా ఏఏ సర్వే నెంబర్లలో ఏఏ రైతుకు సంబంధించిన ఎంత భూమి తీసుకుంటున్నది నిర్ధారణ అవుతుందని తహసీల్దార్ లలిత పేర్కొన్నారు. రేడియల్ రోడ్డుకు ప్రైవేట్‌తో పాటు ప్రభుత్వ భూములు కూడ సర్వే, మార్కింగ్ చేపడుతున్నారు. కాగా ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లిలో రైతులు సర్వే గూర్చి అధికారులు, సర్వే బృందాన్ని వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు.

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం ఆపాలని వినతి


ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న సాకిబండ తండా రైతులు

ఆమనగల్లు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సాగు చేసుకుంటున్న భూముల మీదుగా గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం చేసి తమకు అన్యాయం చేయవద్దని ఆమనగల్లు మున్సిపాలిటీ సాకిబండ తండా గిరిజన రైతులు అధికారులను వేడుకున్నారు. సోమవారం ఈ మేరకు జిల్లా అదనపు కలెక్టర్ , కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, ఆమనగల్లు తహసీల్దార్ లలిత కు వినతి పత్రాలు అందజేశారు. పచ్చటి పంట పొలాల మీదుగా గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణం తగదని, సర్వే, మార్కింగ్ పనులను వెంటనే నిలిపివేయాలని రైతులు వినతి పత్రంలో కోరారు. తమ భూముల మీదుగా రోడ్డు నిర్మాణం చేస్తే తరాలుగా పొందుతున్న ఉపాది ని కోల్పోతామని రైతులు పేర్కొన్నారు. ఉన్న కొద్దిపాటి భూమి మీదుగా రహదారి నిర్మాణం చేయవద్దని అధికారులను కోరారు. సర్వే నెంబర్ 201లో నుంచి గ్రీన్ ఫీల్డ్ రోడ్డు వేయాలని రైతులు సూచించారు.గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పేరుతో ప్రభుత్వం పేదల భూములు బలవంతంగా లాక్కొవడం తగదని అన్నారు. లేనియెడల ప్రభుత్వంపై పోరాటానికి వెనుకాడబోమని తండా రైతులు పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో రైతులు మణిపాల్, బోడ్య, చందర్, పాండు, రవిరాథోడ్, విజేందర్, రాజ, వినోద్, గోపి, కుమార్, శివరామ్ తదితరులు ఉన్నారు.

ప్రధాని మోదీ రైతు పక్షపాతి

చౌదరిగూడ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పీఎం నరేంద్రమోదీ ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిజేస్తుందని, మోదీ రైతు పక్షపాతి అని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం కొందుర్గు మండలం గంగన్నగూడలో కిసాన్ మోర్చా అధికార ప్రతినిధి శివారెడ్డి ఆధ్వర్యంలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద కేంద్రం అందించే రూ.6వేలను రూ.10వేలకు పెంచడం హర్షణీయమని అన్నారు. బీజేపీ నాయకులు లక్ష్మయ్య, సుధాకర్, అంజయ్య, చంద్రశేఖర్, రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానకు డాక్టర్ నియామకం

తలకొండపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి చంద్రదన పల్లె దవాఖానకు నూతన వైద్యురాలిగా డాక్టర్ నందిని నియమితులయ్యారు. రెండేళ్ల క్రితం గ్రామంలో ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం డాక్టర్ నందిని బాధ్యతలు స్వీకరించారు. ఆమెను మాజీ సర్పంచ్ బక్కి కుమార్, ఆశాకార్యకర్తలు సత్కరించారు.

డిమాండ్లు నెరవేర్చాలి


ఆమనగల్లు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని కోరుతూ ఆమనగల్లు మున్సిపల్ కార్మికులు సోమవారం ఆమనగల్లు పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. సీఐటీయు జిల్లా నాయకుడు పెంటయ్య ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీలో కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ర్యాలీ కొనసాగింది. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని, కార్మికులకు కాస్మెటిక్స్ అందజేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సంఘం జిల్లా నాయకులు వగ్గు రవి, సుధాకర్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు చల్లగా ఉండాలి


చాదర్ వద్ద పూజల్లో ప్రతాప్‌రెడ్డి

కొత్తూర్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అజ్మీర్ దర్గా గరీబ్ నవాజ్ ఆశీస్సులతో ప్రతీ ఒక్కరు చల్లగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే చౌల్లపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఇన్ముల్‌నర్వ శివారులో హజ్రత్ జహంగీర్‌పీర్ దర్గాకు చెందిన ఖాజా, నసీర్, హబీబ్‌ల ఆధ్వర్యంలో అజ్మీర్ దర్గాకు భారీ చాదర్ అందజేసేందుకు దర్గా వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ప్రతాప్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం చాదర్‌ను అజ్మీర్ దర్గాకు సమర్పించేందుకు భక్తులు బయలుదేరి వెళ్లారు. మహబుద్, సంధాని, ఖాలేద్, వాజిద్, రఫీక్, అజీమ్ షబ్బీర్, రహమత్, అమీర్, జిలానీ, జమీర్, తదితరులున్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి


అవగాహన కల్పిస్తున్న వాసుదేవరావు

చౌదరిగూడ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదవాలని విద్యాస్వేచ్ఛ ఫౌండేషన్ చైర్మన్ వాసుదేవరావు అన్నారు. శుక్రవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్ద ఎల్కిచర్ల ఉన్నత పాఠశాలలో కెరియర్ గైడెన్స్‌పై టెన్త్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితే లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. అనంతరం టేబుల్స్ కాంపిటీషన్‌లో ప్రతిభ చూపిన 8మందికి రిస్ట్‌వాచ్‌లు అందజేశారు. మాజీ సర్పంచ్ భూపాలచారి, టీచర్లు తదితరులున్నారు.

జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలి

చేవెళ్ల, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో చేవెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుర్వ మహిపాల్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థులు కళాశాలలో చదువుతున్నారని, మౌలిక వసతులు కల్పించాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని వారు ఆరోపించారు. విద్యార్థులకు తగిన వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు నితిష్, కిషోర్, అనిల్, ప్రణయ్, వైశాలి, సింధు తదితరులు ఉన్నారు.

అంచలంచెలుగా సమస్యల పరిష్కారం

కొత్తూర్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని సమస్యలను అంచలంచెలుగా పరిష్కారిస్తున్నామని చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్ యాదవ్ అన్నారు. మున్సిపాలిటీలోని 11వ వార్డు ఫాతిమాపూర్‌లో రూ.5లక్షలతో నిర్మించ తలపెట్టిన భూగర్భ మురుగునీటి కాలువ నిర్మాణం పనులను సోమవారం చైర్‌పర్సన్ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీలో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కారిస్తున్నామని తెలిపారు. కమిషనర్ బాలాజీ, వైస్‌చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు ప్రసన్నలత యాదయ్య, శ్రీనివాస్, నాయకులు జె.శ్రీను, ఆల్విన్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, చంద్రయ్య, కుమ్మరి లక్ష్మయ్య రాజిరెడ్డి, గోపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

కేజీబీవీని సందర్శించిన కాంగ్రెస్ నాయకులు

తలకొండపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని సోమవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు సందర్శించారు. పరిసరాలు, గదులు, వసతులను, భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో సమావేశమై సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పాఠశాల ఎస్వోకు సూచించారు. మెస్‌చార్జీలు పెంచిన విషయాన్ని వివరించారు. నర్సింహ, మల్లేశ్, గణేశ్, యాదగిరి, నర్సింహరెడ్డి, మల్లేశ్, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **తలకొండపల్లి:** మండల కేంద్రానికి చెందిన సువర్ణ అనారోగ్యంతో మృతిచెందింది. మృతురాలు కుటుంబాన్ని సోమవారం మండల కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.5, 500 ఆర్థిక సాయం అందజేశారు. సురేందర్‌రెడ్డి, నర్సింహరెడ్డి, తుమ్మ నర్సింహ, మల్లేశ్, యాదగిరి, రమణారెడ్డి, గణేశ్, ప్రభాకర్‌రెడ్డి, మల్లేశ్, గిరిధర్, రాజశేఖర్‌రెడ్డి, తదితరులున్నారు.
- **నందిగామ :** అయ్యప్ప దీక్ష పరమ పవిత్రమని మాజీ ఎమ్మెల్యే చౌల్లపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో స్వాములతో పాటు భక్తులకు ప్రతాప్‌రెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, జిల్లెల్ల రాంరెడ్డి, జంగ నర్సింలు, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, సుదర్శన్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులున్నారు.
- **కడ్తాల్ :** మండల కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రం ఎదుట లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ జి.చెన్నకిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎనుగొండ రాంరెడ్డి లయన్స్‌కంటి ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ వి.దామోదర్‌రెడ్డి పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, లయన్స్‌క్లబ్ కార్యదర్శి మహేశ్, గోవర్ధన్‌రెడ్డి, అంజయ్య, పిప్పళ్ల వెంకటేశ్, తదితరులున్నారు.
- **ఆదిభట్ల :** విద్యార్థులు కష్టపడి చదివితే ఉత్తమ భవిష్యత్తు ఉంటుందని సీవీఆర్ కాలేజీ చైర్మన్ డాక్టర్ రాఘవ తెలిపారు. కాలేజీ యజమాన్యం ఇబ్రహీంపట్నం మండలం శేరిగూడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇచ్చింది. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసి, పాఠశాలకు 4 కంప్యూటర్లును అందజేశారు.
- **చేవెళ్ల :** ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి అని ఎంపీడీవో హిమబిందు, ఎంపీవో విఠలేశ్వర్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో అంటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న రాజు పదవీరమణ సందర్భంగా అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు.
- **ఆదిభట్ల :** ఏడు క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నట్లు సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. పీడీఎస్ బియ్యాన్ని వాహనంలో తరలిస్తుండగా నాదర్‌గుల్ చౌరస్తాలో ఎస్సై వెంకటేష్ తనిఖీలు నిర్వహిస్తున్నాడు. నూర్ ఆలంతో పాటు మరో వ్యక్తి నాదర్‌గుల్ ప్రాంతంలో బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు గుర్తించారు.

రోడ్డు ప్రమాదంలో అయ్యప్ప స్వాములకు తీవ్ర గాయాలు

ఇబ్రహీంపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): శబరిలో అయ్యప్పస్వామిని దర్శించుకున్న స్వాములు.. తిరుగు ప్రయాణంలో కారులో బయలుదేరి వస్తుండగా.. ఆదివారం రాత్రి తమిళనాడులోని నాగర్‌సోల్ సమీపంలో విద్యుత్ పోల్‌కు కారు ఢీకొట్టడంతో ఇబ్రహీంపట్నంకు చెందిన ఏడుగురికి తీవ్రగాయలైనాయి. వీరిలో ముగ్గురు ఇబ్రహీంపట్నం మున్సిపల్ కౌన్సిర్లుకూడా ఉన్నారు. ఈమేరకు వారి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 3న ఇబ్రహీంపట్నం నుంచి మున్సిపల్ కౌన్సిలర్లు జెర్కోని బాల్‌రాజ్, మంద సుధాకర్, ఆర్.మోహన్‌నాయక్‌తోపాటు మరో నలుగురు మున్సిపల్ చైర్మన్ బర్ల మంగ భర్త జగదీశ్వర్‌యాదవ్, గాజుల గోపాల్, కర్నె అరవింద్, జంగయ్యలు కారులో బయలుదేరి శబరిమలైలో అయ్యప్ప దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. కన్యాకుమారి రోడ్డు నాగర్‌సోల్ సమీపంలో ఆదివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఓ విద్యుత్ పోల్‌ను ఢీకొట్టింది. దాంతో ఆ ఏడుగురికి తీవ్ర గాయాలుకాగా దగ్గర్లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.